
శనివారం
03-08-2024
# ముందడుగు
దినపత్రిక
సంపుటి: 1, సంచిక: 413 పేజీలు: 4 | ₹6
EPAPER.MUNDADUGU.COM
SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచేయొచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..
Mundadugu whatsapp:
9491114616
email: mundadugu111@gmail.com



రైల్వేలో పిల్లల కోసం
## బేబీ బెర్తులు..
మిగతా 2లో



మూడేళ్ల చిన్నారిపై పడిన ఇంటి ఇనుప గేటు
మిగతా 3లో



20 రోజుల్లో 14 మంది చిన్నారులు మృతి
మిగతా 3లో



లవర్‌బాయ్‌గా
## ఎన్టీఆర్..
మిగతా 5లో

# టీచర్లు తేనెతుట్టె లాంటి వాళ్లు..

- హాని చేయాలని చూస్తే ఎదురుదాడికి దిగుతారు
- 30 వేల మంది టీచర్లతో ప్రభుత్వ కార్యక్రమం
- ఎల్బీ స్టేడియంలో సీఎం రేవంత్ రెడ్డి

ముందడుగు తెలంగాణ:

తెలంగాణ భవిష్యత్ ఎక్కడుంది అని ఈ క్షణం నన్ను అడిగితే.. వేలాది మంది ఉపాధ్యాయుల రూపంలో ఎల్బీ స్టేడియంలో ఉందని చెబుతా.. 30వేల ప్రభుత్వ పాఠశాలల్లో 26లక్షల మంది విద్యార్థుల తల్లిదండ్రులు వారి భవిష్యత్‌ను మీ చేతుల్లో పెట్టారు. తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటంలో ఉపాధ్యాయుల పాత్ర కాదనలేనిదని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో ఉపాధ్యాయులతో సీఎం రేవంత్ రెడ్డి సమావేశం నిర్వహించి కీలక విషయాలను వెల్లడించారు. ఇటీవల పదోన్నతి 30 వేల మంది టీచర్లతో ప్రభుత్వం ఈ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించింది. రాష్ట్రం వస్తే విద్యా విధానం బాగుపడుతుంద నుకున్నాం.. ఉపాధ్యాయుల గౌరవం పెరుగుతుందనుకున్నాం.. కోదండరాం, హరగోపాల్, చుక్కా రామయ్యలాంటి వాళ్లకు గొప్ప గౌరవం దక్కుతుందనుకున్నాం..



కానీ తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంలో ఏం జరిగిందో చూశాం. గత పాలకులు ఉపాధ్యాయులను ఏ విధంగా అవమానించారో చూశాం. టీచర్లు తేనెతుట్టె లాంటి వాళ్లు.. హాని చేయాలని చూస్తే తీనెటీగల్లా ఎదురుదాడికి దిగుతారు. ప్రభుత్వంపై ఉద్యోగులకు నమ్మకం కలిగించేందుకు ప్రతీ నెలా 1వ తారీఖునే జీతాలు అందించేలా చర్యలు తీసుకున్నాం. పదిహేనేళ్లుగా పెండింగ్‌లో ఉన్న టీచర్ల ప్రమోషన్ల అంశాన్ని పరిష్కరించాం.. మీ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పడానికే ఈ సమావేశం ఏర్పాటు చేశాం' అని అన్నారు. తెలంగాణ బలపడాలంటే అది ఉపాధ్యాయుల వల్లనే సాధ్యం అవుతుందని అన్నారు.

## వయనాడ్‌లో 100కు పైగా
# ఇళ్లు కట్టిస్తాం

- బాధితులకు రాహుల్ గాంధీ హామీ
- ఈ ఘటనను పార్లమెంటులో లేవనెత్తుతాం




ముందడుగు కేరళ:

కేరళలోని వయనాడ్ జిల్లాలో కాంగ్రెస్ అగ్రనేతలు వయనాడ్ మాజీ ఎంపీ రాహుల్ గాంధీ, ప్రియాంకాగాంధీ పర్యటిస్తున్నారు. ఈసందర్భంగా రాహుల్ ఒక హామీ ఇచ్చారు. తమ పార్టీ తరఫున బాధితులకు 100కు పైగా ఇళ్లను కట్టి ఇస్తామని తెలిపారు. స్థానిక అధికారులతో సమావేశం అనంతరం రాహుల్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఒకే ప్రాంతంలో ఇంతటి భయానక విషాదాన్ని మునుపెన్నడూ చూడలేదని ఆవేదన వ్యక్తంచేశారు. మిగతా వాటి మాదిరిగా కాకుండా దీనిని భిన్నంగా చూడాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరతానని అన్నారు. అలాగే ఈ ఘటనను పార్లమెంట్‌లో లేవనెత్తుతామని చెప్పారు. మిగతా 2లో

# అసెంబ్లీలో జాబ్ క్యాలెండర్ ప్రకటన

- విడుదల చేసిన ఉప ముఖ్యమంత్రి భట్టి
- పరీక్షల తేదీలు, నియామకాలు వివరాలు

ముందడుగు తెలంగాణ:

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లలో జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేసింది. ఏయే ఉద్యోగాలు ఎప్పుడు భర్తీ చేయాలనే విషయాలను క్యాలెండర్‌లో స్పష్టంగా పేర్కొన్నారు. నోటిఫికేషన్ విడుదల చేసే నెల, పరీక్షలు మిగతా 2లో




# ప్రశ్నలు అడగండి.. కథలు చెప్పడానికి కాదు

## ఎంపీపై స్పీకర్ ఓం బిర్లా ఆగ్రహం

ముందడుగు జాతీయం:

లోక్‌సభలో అడగాలనుకున్న విషయాలు నేరుగా అడగాలని, కథలు చెప్పవద్దని శుక్రవారం స్పీకర్ ఓం బిర్లా ఓ ఎంపీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సభలో ఒడిశాకు చెందిన భాజపా సభ్యుడు ప్రదీప్ పురోహిత్ కేంద్ర ఆయుష్ మంత్రిని ఓ ఆయుర్వేద కళాశాల గురించి ప్రశ్నిస్తూ, అక్కడి మూలికల మిగతా 2లో



ముందడుగు
శనివారం, 03-08-2024, హైదరాబాద్

# అసెంబ్లీలో జాబ్ క్యాలెండర్ ప్రకటన

(మొదటిపేజీ తరువాయి)
ఎప్పుడు నిర్వహించాలనే వివరాలతో పాటు నియామకాలు నిర్వహించే ఏజెన్సీ, ఉద్యోగానికి కావాల్సిన అర్హతల గురించి అందులో పొందుపర్చారు. ఈ మేరకు జాబ్ క్యాలెండర్‌ను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శాసనసభలో ప్రకటించారు.

### జాబ్ క్యాలెండర్ ప్రకారం

- టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో గ్రూప్-1 పరీక్షలు అక్టోబరులో, గ్రూప్-2ను డిసెంబరులో, గ్రూప్-3 నవంబరులో నిర్వహించనున్నారు.
- వైద్యఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ల్యాబ్ టెక్నీషియన్, నర్సింగ్ ఆఫీసర్ నియామకాల కోసం సెప్టెంబర్‌లో నోటిఫికేషన్ విడుదల... నవంబర్‌లో పరీక్షలు.
- ట్రాన్స్‌లోని వివిధ ఇంజనీరింగ్ ఉద్యోగాల కోసం అక్టోబర్‌లో నోటిఫికేషన్.. వచ్చే ఏడాది జనవరిలో నియామక పరీక్షలు
- నవంబర్‌లో టెట్ నోటిఫికేషన్ విడుదల చేసి వచ్చే ఏడాది జనవరిలో పరీక్షలు..
- వివిధ శాఖల్లో గెజిటెడ్ ఉద్యోగాల కోసం వచ్చే ఏడాది జనవరిలో నోటిఫికేషన్ విడుదల.. ఏప్రిల్‌లో పరీక్షలు..
- వచ్చే ఏడాది ఫిబ్రవరిలో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల .. ఏప్రిల్‌లో పరీక్షలు..
- ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఉద్యోగాలకు వచ్చే ఏడాది ఫిభ్రవరిలో నోటిఫికేషన్ .. మేలో పరీక్షలు..
- గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష వచ్చే ఏడాది జూలైలో నిర్వహించనున్నారు..
- ఎస్ఐ, పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం వచ్చే ఏడాది ఏప్రిల్‌లో నోటిఫికేషన్ విడుదల చేసి ఆగస్టులో పరీక్షలు నిర్వహిస్తారు..
- డిగ్రీ కళాశాలల్లో అధ్యాపకులు, ఫిజికల్ డైరెక్టర్లు, లైబ్రేరియన్ పోస్టులకు వచ్చే ఏడాది జూన్‌లో నోటిఫికేషన్.. సెప్టెంబర్‌లో పరీక్షలు..
- వచ్చే ఏడాది మేలో మరోసారి గ్రూపు2 నోటిఫికేషన్.. అక్టోబర్‌లో పరీక్షలు..
- వచ్చే ఏడాది జులైలో గ్రూప్-3 నోటిఫికేషన్ నవంబర్‌లో పరీక్షలు..
- సింగరేణిలో పలు ఉద్యోగాల కోసం వచ్చే ఏడాది జులైలో నోటిఫికేషన్.. నవంబర్‌లో పరీక్షలు..

# వయనాడ్‌లో 100కు పైగా ఇళ్లు కట్టిస్తాం




(మొదటిపేజీ తరువాయి)
ఈ సందర్భంగా 100 ఇళ్ల హామీ ఇచ్చారు. ఆ ప్రాంతంలో జరిగిన ప్రాణ, ఆర్థిక నష్టం గురించి అధికారులు ఆయనకు వెల్లడించారు.

ఈ విషాదం జాతీయ విపత్తని రాహుల్ అభివర్ణించిన సంగతి తెలిసిందే. వెంటనే సమగ్ర కార్యాచరణ ప్రణాళికతో పునర్నిర్మాణం చేపట్టాలని కేంద్రాన్ని డిమాండు చేశారు. ఆయన తన సోదరి, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీతో కలిసి గురువారం కొండ చరియలు విరిగిపడిన చురాల్‌మలలో పర్యటించారు. వీరిద్దరూ తాత్కాలికంగా చెక్కతో ఏర్పాటుచేసిన వంతెనను దాటి బురద పేరుకుపోయిన ప్రాంతాల్లో వర్షంలోనే తిరిగారు. ఈ రోజు కూడా వయనాడ్‌లోని ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. ఈ విలయంలో సర్వం కోల్పోయిన వారికి మానసికంగా భరోసా కల్పించేందుకు కేరళ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 121 మంది మానసిక నిపుణుల బృందాన్ని వయనాడ్ పంపినట్లు రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి వీణా జార్జ్ వెల్లడించారు.

# ప్రశ్నలు అడగండి.. కథలు చెప్పడానికి కాదు

(మొదటిపేజీ తరువాయి)
చరిత్ర గురించి ప్రస్తావించారు. దీంతో స్పీకర్ "మీరు మహాభారత కథలు చెప్పకండి.. ప్రశ్నలే అడగండి. ఈ మధ్య సభలో మహాభారతం గురించి చెప్పడం ఫ్యాషనైపోయింది" అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం జరిగిన పార్లమెంట్ సమావేశాల్లో కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ మాట్లాడుతూ చక్రవ్యూహం గురించి ప్రస్తావించారు. ఆరుగురు వ్యక్తులు దేశం మొత్తాన్ని 'పద్మవ్యూహం'లోకి నెట్టివేస్తున్నారని ధ్వజమెత్తారు.

రాజకీయ, వ్యాపార గుత్తాధిపత్యాన్ని మరింత బలోపేతం చేయడమే కేంద్ర బడ్జెట్ ముఖ్య ఉద్దేశమని రాహుల్ గాంధీ




ఆరోపించారు. దేశాన్ని బంధించిన చక్రవ్యూహం వెనుక మూడు శక్తులు ఉన్నాయన్నారు. దేశ సంపద మొత్తాన్ని కబళించాలని చూస్తున్న ఇద్దరు వ్యక్తులు మొదటి శక్తి కాగా, దర్యాప్తు సంస్థలైన సీబీఐ, ఈడీ, ఆదాయపు పన్ను శాఖ రెండోదని తెలిపారు. రాజకీయ కార్యనిర్వాహక వర్గాన్ని మూడో శక్తిగా రాహుల్ అభివర్ణించారు. ఇవి దేశాన్ని విధ్వంసం చేస్తున్నాయని దుయ్యబట్టారు.

## రైల్వేలో పిల్లల కోసం

# బేబీ బెర్తులు..

### ప్రయోగాత్మకంగా తీసుకొచ్చిన రైల్వేశాఖ



ముందడుగు జాతీయం:
రైల్వేలో తల్లుల ప్రయాణాన్ని సౌకర్యవంతంగా మార్చేందుకు పిల్లల కోసం బేబీ బెర్తులను ప్రయోగాత్మకంగా అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ విషయాన్ని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ రాజ్యసభలో వెల్లడించారు. ట్రైన్ కోచ్‌లలో బేబీబెర్త్‌లను అమర్చే అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉందా..? అని భాజపా ఎంపీ సమర్ సింగ్ సోలంకీ ప్రశ్నించారు. దానికి మంత్రి స్పందిస్తూ.. "లఖ్‌నవూ మెయిల్‌లో రెండు బేబీ బెర్త్‌లను ప్రయోగాత్మకంగా తీసుకువచ్చాం. లఖ్‌నవూ మెయిల్‌లోని ఒక కోచ్‌లో రెండు దిగువ బెర్త్‌లకు వాటిని అమర్చాం. దీనిపై వచ్చిన ఫీడ్‌బ్యాక్‌లో ప్రశంసలు అందాయి. అయితే సామాన్లు పెట్టుకునే స్థలం తగ్గిపోవడం, సీట్ల మధ్య దూరం తగ్గడం వంటి సమస్యలు మా దృష్టి వచ్చాయి. ప్యాసింజర్ కోచ్‌లలో ఎప్పటికప్పడు మార్పులు జరుగుతుంటాయి. అది నిరంతర ప్రక్రియ" అని మంత్రి వెల్లడించారు.

బేబీ బెర్తులు.. పిల్లల కోసం ప్రత్యేకంగా రూపొందించిన చిన్నపాటి పడకలు. లోయర్ బెర్త్‌కు అటాచ్ అయి ఉంటాయి. ప్రయాణ సమయంలో తల్లులు ఈ బెర్త్‌పై తమ చిన్నారులను పడుకోబెట్టుకోవచ్చు. సాధారణంగా అయితే.. ఒకే బెర్త్‌పై తల్లీబిడ్డా సర్దుబాటు కావాల్సి ఉంటుంది. దీంతో స్థలం సరిపడక.. ఇబ్బందులు తప్పేవి కావు. ఇప్పుడు బేబీ బెర్త్ సాయంతో పిల్లల్ని తమ పక్కనే సురక్షితంగా పడుకోబెట్టొచ్చు. అవసరం లేనప్పుడు దీన్ని లోయర్ బెర్త్ కిందికి మడతపెట్టొచ్చు. శిశువును సురక్షితంగా ఉంచడానికి పట్టీలూ ఉన్నాయని గతంలో అధికారులు వెల్లడించారు.

# పైరసీలతో ఏటా రూ.20వేల కోట్ల నష్టం

### ఆప్ ఎంపీ రాఘవ్ చద్దా వెల్లడి



ముందడుగు జాతీయం:
ప్రస్తుత సమాజంలో రోజురోజుకి పైరసీ రక్కసి విజృంభిస్తుండటంతో చిత్ర పరిశ్రమ అనేక సవాళ్లు ఎదుర్కొంటోందని ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీ రాఘవ్ చద్దా పేర్కొన్నారు. ఒకప్పుడు చిత్ర పరిశ్రమకే పరిమితమైన పైరసీ ప్రస్తుతం అంటువ్యాధిలా ఓటీటీలకూ పాకిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీని కారణంగా ఫిల్మ్ ఇండస్ట్రీకి ఏడాదికి రూ.20 వేల కోట్లు నష్టం వాటిల్లుతోందన్నారు. ఈ మేరకు శుక్రవారం రాజ్యసభలో ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన మాట్లాడారు.

కొవిడ్ మహమ్మారి తర్వాత ఓటీటీల పైరసీ 62శాతం పెరిగిందని రాఘవ్ చద్దా వెల్లడించారు. ఇది కళాకారుల సృజనాత్మకను దెబ్బతీయడంతో పాటు చిత్ర పరిశ్రమ ఆర్థిక స్థితిగతులు బలహీనం చేస్తోందన్నారు. గతేడాది సినిమాటోగ్రఫీకి సంబంధించి పాస్ చేసిన బిల్లులో థియేటర్‌లలో కెమెరా రికార్డింగ్ నిషేధంపై మాత్రమే దృష్టి సారించారన్నారు. ఆ బిల్లు ఇతర పైరసీలతో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోలేదన్నారు. ఈ సమస్యను సమర్థంగా పరిష్కరించేందుకు కేంద్రం ప్రత్యేక చట్టాలు ప్రవేశపెట్టాలని కోరారు.

ముందడుగు
శనివారం, 03-08-2024, హైదరాబాద్

# 20 రోజుల్లో 14 మంది చిన్నారులు మృతి

▪ఆశ్రమంలో చిన్నారుల అనుమానాస్పద మరణాలు
▪దేశ రాజధాని ఢిల్లీలో ఘటన



ముందడుగు ఢిల్లీ:
దేశ రాజధాని ఢిల్లీలోని ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే ఓ ఆశ్రమంలో చిన్నారుల అనుమానాస్పద మరణాలు చర్చనీయాంశమయ్యాయి. గడిచిన 20 రోజుల్లోనే 14 మంది ప్రాణాలు కోల్పోవడం కలవరపెడుతోంది. అందులో ఎక్కువ మంది మానసిక వికలాంగులే కావడం కలచివేస్తోంది. మొత్తంగా ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు 27 మంది చనిపోగా, మరణాలకు గల కారణాలు తెలియకపోవడం సంచలనంగా మారింది. దీనిపై వార్తలు రావడం, విపక్షాలు ఆందోళనలతో స్పందించిన 'ఆప్' ప్రభుత్వం పూర్తి స్థాయి దర్యాప్తునకు ఆదేశించింది. దేశ రాజధానిలో ఇటువంటి పరిణామం చోటుచేసుకోవడం షాక్‌కు గురిచేసిందని మంత్రి ఆతిశీ పేర్కొన్నారు. ఇటువంటి నిర్లక్ష్యాలను సహించేదిలేదని, పూర్తి స్థాయిలో దర్యాప్తు తర్వాత బాధ్యులపై చర్యలు తప్పవన్నారు. 48గంటల్లోగా దీనిపై దర్యాప్తు జరిపి సమగ్ర నివేదిక ఇవ్వాలని ఉన్నతాధికారులను ఆదేశించారు
ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించిన జాతీయ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రేఖా శర్మ.. నిజనిర్ధారణ బృందాన్ని అక్కడికి పంపించినట్లు చెప్పారు. మరోవైపు ఈ ఘటనపై ఆందోళనకు దిగిన భాజపా.. ఆశ్రమం ముందు ధర్నా చేపట్టింది.

# దేశానికి మెడల్ అందించలేకపోయాను

▪సారీ చెప్పిన బాక్సింగ్ క్రీడాకారిణి నిఖత్ జరీన్
▪చైనా క్రీడాకారిణి వూ యూ చేతిలో ఓటమి

ముందడుగు జాతీయం:
పారిస్ ఒలింపిక్స్‌లో బాక్సింగ్ ఈవెంట్‌లో తెలంగాణ అమ్మాయి నిఖత్ జరీన్ కచ్చితంగా మెడల్ కొడుతుందని భావించారు. కానీ అనూహ్యంగా ఆమె రెండో రౌండ్‌లోనే నిష్క్రమించింది. బలమైన ప్రత్యర్థి చేతిలో ఖంగుతిన్నది. దీనిపై నిఖత్ జరీన్ తన మనోవేదన వెల్లడించారు. రెండు సార్లు వరల్డ్ చాంపియన్ అయిన నిఖత్.. ఆ బౌట్‌కు ముందు రోజు రాత్రి నిద్రపోలేదు. ప్రీ క్వార్టర్స్‌లో పోటీపడేందుకు.. ఖాళీ కడుపుతోనే ఆమె శిక్షణ తీసుకున్నట్లు చెప్పింది. 52 కిలోల విభాగంలో చైనా



క్రీడాకారిణి వూ యూ చేతిలో ఓడిపోవడాన్ని నిఖత్ తట్టుకోలేకపోతున్నది. దేశానికి మెడల్ అందించలేకపోయినందుకు జరీనా సారీ చెప్పింది. ఈ స్థాయి వరకు వచ్చేందుకు చాలా త్యాగం చేయాల్సి వచ్చిందని చెప్పింది. మానసికంగా, శారీరకంగా ఒలింపిక్స్ కోసం ప్రిపేరైనట్లు తెలిపింది.

# మూడేళ్ల చిన్నారిపై పడిన ఇంటి ఇనుప గేటు

## అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయిన చిన్నారి

ముందడుగు మహారాష్ట్ర:
మూడేళ్ల చిన్నారిపై భారీ ఇనుప గేటు పడింది. ఈ ఘటనలో చిన్నారి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. మహారాష్ట్ర పూణెలోని పింప్రి – చించ్‌వాడ్ ప్రాంతంలో బుధవారం ఈ ఘటన చోటు చేసుకుంది. చిన్నారి తోటి స్నేహితులతో కలిసి వీధిలో ఆడుకుంటోంది. ఈ క్రమంలో ఇద్దరు పిల్లలు గేటు తీసుకుని ఇంటి లోపలికి వెళ్తారు. అనంతరం గేటును వేయగా.. అదే సమయంలో అక్కడికి వచ్చిన మూడేళ్ల చిన్నారిపై ఇనుప గేటు ఒక్కసారిగా పడుతుంది. దీంతో భయాందోళనకు గురైన ఇతర పిల్లలు అక్కడినుంచి పరుగులు తీస్తారు.



ఈ ఘటనలో చిన్నారి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. మృతి చెందిన చిన్నారిని గిరిజా గణేష్ షిండేగా గుర్తించారు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు డీసీపీ శివాని పవార్ తెలిపారు. ఈ షాకింగ్ ఘటనకు సంబంధించిన దృశ్యాలు వీధిలోని ఓ ఇంటి వద్ద సీసీటీవీ ఫుటేజ్‌లో రికార్డయ్యాయి. ప్రస్తుతం ఆ వీడియో నెట్టింట వైరల్‌గా మారింది.

ఆంగ్ల సాహిత్యంలో

# నోముల రజనీశ్‌కు డాక్టరేట్ ప్రదానం



ముందడుగు నల్లగొండ:
నల్లగొండ పట్టణానికి చెందిన నోముల రజనీష్ పి.హెచ్.డీ పట్టా పొందారు. నోముల రాజనీష్ ప్రస్తుతం గోల్కొండ లోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఆంగ్ల సహాయ ఆచార్యునిగా పనిచేస్తున్నారు. రజనీశ్ కు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ దూర విద్యా కేంద్రం పీ. ఎచ్. డీ. పట్టా ప్రదానం చేసింది.
'ఖుష్వంత్ సింగ్ కథా సాహిత్యం - ఒక అధ్యయనం' అనే అంశంపై డాక్టర్ రాజు బొల్లవరపు పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు గాను నోముల రజనీశ్ కు ఆంగ్ల సాహిత్యంలో పీ. ఎచ్. డీ. ప్రదానం చేసినట్లుగా ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఒక పత్రికా ప్రకటనలో తెలిపింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె శ్రీనివాసరాజు మరియు ఇతర బోధన, బోధనేతర సిబ్బంది నోముల రజనీశ్ కు అభినందనలు తెలిపారు.




# మోసాల బారిన పడకుండా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సందేశం

ముందడుగు హైదరాబాద్:
భారతదేశంలోని అతిపెద్ద ప్రైవేట్ రంగ బ్యాంకుగా ఉన్న హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా పెట్టుబడి అవకాశాలను ఎక్కువగా అందించే మోసపూరిత ట్రేడింగ్ ప్లాట్‌ఫారమ్‌ల పట్ల జాగ్రత్తగా ఉండాలని తన వినియోగదారులకు సూచించింది. వినియోగదారులను రక్షించేందుకు పెట్టుబడి మోసాలకు సంబంధించి ముందస్తుగా జాగృతిని, అవగాహనను పెంచడమే బ్యాంకు లక్ష్యాన్ని కలిగి ఉంది. ఇటువంటి మోసాలపై హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ క్రెడిట్ ఇంటెలిజెన్స్ అండ్ కంట్రోల్ ఎగ్జిక్యూటివ్ ఉపాధ్యక్షుడు మనీష్ అగర్వాల్ హెచ్చరిస్తూ, "మేము పెట్టుబడి మోసాల కేసుల్లో వృద్ధిని చూస్తున్నాము. వాటి గురించి విస్తృత అవగాహన, జ్ఞానాన్ని, జాగృతి కల్పించేందుకు వినియోగదారులు సమస్యల బారిన పడకుండా సహాయపడాలని కోరుకుంటున్నాము. తద్వారా వినియోగదారులు ఈ మోసపూరిత పథకాల బారిన పడకుండా ఉండగలరు. ప్రభుత్వం, బ్యాంకులు మరియు నియంత్రణ సంస్థలు ఈ మోసాలను అరికట్టడానికి చర్యలు తీసుకుంటున్నప్పుడు, చట్టవిరుద్ధమైన పథకాల బారిన పడకుండా ఉండటంలో వ్యక్తిగత అప్రమత్తత మరియు అవగాహన చాలా ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి" అని వివరించారు.

ముందడుగు
శనివారం,
03-08-2024,
హైదరాబాద్

## శ్రీ సాయి విజ్ఞాన భారతి హైస్కూల్‌లో గ్రీన్ కలర్ డే సెలబ్రేషన్స్



ముందడుగు వరంగల్:

వరంగల్ జిల్లా లేబర్ కాలనీ ప్రాంతానికి చెందిన శ్రీ సాయి విజ్ఞాన భారతి హైస్కూల్ నందు గ్రీన్ కలర్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించినట్లు పాఠశాల కరస్పాండెంట్ డా. సామల శశిధర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీ బొల్లం కనకయ్య గారు అధ్యక్షులు వడుప్సా వరంగల్, కార్యదర్శి జన్ను విలియమ్స్, కోశాధికారి బలవారి సుధీర్ కుమార్ హాజరై వారు మాట్లాడుతూ విద్యార్థులకు చిన్నప్పటినుండే రంగుల పట్ల మక్కువ ఏర్పడాలని మరియు ప్రకృతి సౌందర్యాన్ని కలిగిన ఆకుపచ్చ రంగు పట్ల విద్యార్థులకు అవగాహన కలిగే విధంగా ఈరోజు గ్రీన్ కలర్ డే సెలబ్రేషన్ ఏర్పాటు చేయడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. విద్యార్థినీ విద్యార్థులంతా ఆకుపచ్చని దుస్తులలో పాఠశాలకు విచ్చేసి ఆకుపచ్చ రంగు కలిగినటువంటి పండ్లు, కూరగాయలు, బొమ్మలు, పలు రకాల వస్తువులను తీసుకువచ్చి, ఆకుపచ్చని బెలూన్లతో, అలంకరించి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## మేరు ఇంటర్నేషనల్ స్కూల్ ఆధ్వర్యంలో మేరుత్సవ్

### విద్యార్థుల ప్రతిభ, నైపుణ్యాలతో వేడుకలు..






ముందడుగు హైదరాబాద్:

మేరు ఇంటర్నేషనల్ స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించే వార్షిక ఇంటర్‌స్కూల్ ఫెస్ట్ 'మేరుత్సవ్-2024'ను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు, అధ్యాపకుల ఆలోచనాత్మక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా మేరు ఇంటర్నేషనల్ స్కూల్ వ్యవస్థాపకురాలు మేఘనా గోరుకంటి జూపల్లి నిర్వహణలోని ఈ అద్భుత కార్యక్రమం.. గత ఐదేళ్లలో దక్షిణ భారత్‌లోనే గణనీయంగా అభివృద్ధి చెందిన అతిపెద్ద ఇంటర్‌స్కూల్ ఫెస్ట్‌లలో ఒకటిగా నిలిచింది. వ్యవస్థాపకులు మేఘన గోరుకంటి జూపల్లి దార్శనికతలో మేరు ఇంటర్నేషనల్ స్కూల్‌లోని ప్రతి ఒక్కరి అంకితభావానికి నిదర్శనంగా ఈ ఫెస్ట్ విజయం నిలుస్తుంది. ఈ వేడుకలు ముగిసే సమయానికి...మేరుత్సవ్ 2024 ప్రభావం ఈ ప్రాంతం అంతటా ప్రతిధ్వనిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఈ ప్రయత్నం భవిష్యత్తు తరాల శ్రేష్ఠత, శ్రేయస్సు కోసం కృషి చేయడానికి, సమాజిక సానుకూలతకు దోహదపడేలా ప్రేరేపిస్తుంది. ఈ మేరుత్సవ్‌లో భాగంగా దాదాపు 200 పాఠశాలలకు పైగా స్వాగతించడంతో పాటు 15,000 పైగా హాజరైన విద్యార్థుల ఆతిథ్యం, ప్రతిభను ప్రదర్శించడానికి అద్భుత వేదికను ఏర్పాటు చేయడంలో మేరు విశిష్టతను చాటుకుంది. ఈ సంవత్సరం థీమ్‌గా.. యూఎన్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ "5 Ps" అయినటువంటి 'ప్రజలు, గ్రహం, శ్రేయస్సు, శాంతి, భాగస్వామ్యాల'ను ఫెస్ట్ యొక్క విభిన్న కార్యకలాపాలు, పోటీలకు మార్గదర్శక సూత్రాలుగా నిర్ధారించారు.

## మహారాజ సినిమా దర్శకుడిని అభినందించిన రజినీకాంత్




తమిళ నటుడు విజయ్ సేతుపతి ప్రధాన పాత్రలో నటించిన రీసెంట్ బ్లాక్ బస్టర్ మహారాజ. భారీ అంచనాల నడుమ జూలై 14న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం తమిళంతో పాటు తెలుగులో మంచి విజయాన్ని అందుకున్న విషయం తెలిసిందే. తమిళనాడులో రూ.100 కోట్ల వసూళ్లను రాబట్టడమే కాకుండా విజయ్ కెరీర్‌లో మైలురాయిగా నిలిచిపోయింది ఈ చిత్రం. అయితే ఈ సినిమా నెట్‌ఫ్లిక్స్‌లోకి వచ్చిన అనంతరం ఓటీటీలో కూడా రికార్డు వ్యూస్‌తో దూసుకుపోతుంది. ఇప్పటికే ఈ మూవీ చూసిన కోలీవుడ్ హీరో, తమిళ వెట్రి కళగం పార్టీ అధినేత దళపతి విజయ్ చిత్రంపై ప్రశంసలు కురిపించడమే కాకుండా.. చిత్ర దర్శకుడు నిథిలన్ స్వామినాథన్‌ను కలుసుకుని ప్రత్యేకంగా అభినందించాడు. ఇదిలావుంటే తాజాగా ఈ సినిమా చూసిన తమిళ అగ్ర నటుడు రజినీకాంత్ సినిమాపై ప్రశంసల వర్షం కురిపించడంతో పాటు దర్శకుడు నిథిలన్ స్వామినాథన్‌ను తన ఇంటికి ప్రత్యేకంగా పిలుచుకోని అభినందించాడు. ఇక రజినీతో దిగిన ఫోటోలను దర్శకుడు నిథిలన్ తన ఎక్స్ పేజీలో షేర్ చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక పోస్ట్ పెట్టాడు. ప్రియమైన సూపర్ స్టార్ రజినీకాంత్ సార్. మీతో ఈ అద్భుతమైన సమావేశానికి ధన్యవాదాలు. మిమ్మల్ని కలవడం మీతో మాట్లాడటం అనేది జీవితం గురించి నవల చదివినట్లుగా అనిపించింది. మీ ఆతిథ్యం వినయం చూసి నేను ఆశ్చర్యపోయాను. మీరు ఎల్లప్పుడూ ఇలాగే ఉండాలి. మహారాజా సినిమా మీకు నచ్చినందుకు చాలా ఆనందంగా ఉంది. మీకు మరోసారి ధన్యవాదాలు అంటూ నిథిలన్ స్వామినాథన్ రాసుకోచ్చాడు.

## నేచురల్ లుక్.. పల్లెటూరి బుజ్జమ్మగా అనన్య

పల్లెటూరి నేపథ్యంలో సాగే కథాంశంతో రూపొందుతోన్న చిత్రం 'పొట్టేల్'. యువచంద్రకృష్ణ, అనన్య నాగళ్ల జంటగా నటించారు. సాహిత్ మోత్ఖూరి దర్శకుడు. నిశాంక్‌రెడ్డి కుడితి, సురేశ్‌కుమార్ సడిగె నిర్మాతలు. నిర్మాణం పూర్తి చేసుకున్న ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. గురువారం అనన్య నాగళ్ల పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ స్పెషల్ పోస్టర్ విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో పల్లెటూరి అమ్మాయి బుజ్జమ్మగా అనన్య చాలా నేచురల్ లుక్‌లో కనిపిస్తున్నది. ఇందులో నటనకు అవకాశం ఉన్న మంచి పాత్రను అనన్య పోషించిందని మేకర్స్ చెబుతున్నారు. అజయ్ పవర్‌ఫుల్ పాత్ర పోషిస్తున్న ఈ చిత్రంలో ప్రియాంకశర్మ, తనస్వి చౌదరి, నోయల్‌సీన్, తదితరులు ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: మోనిష్ భూపతిరాజు, సంగీతం: శేఖర్‌చంద్ర.



ముందడుగు
శనివారం,
03-08-2024,
హైదరాబాద్



## విధి అతని కోసం
# వేచి ఉంది

### విజయ్ దేవరకొండ VD12 లుక్‌తో రిలీజ్ టైం ఫిక్స్

జెర్సీ ఫేం గౌతమ్ తిన్ననూరి డైరెక్షన్‌లో విజయ్ దేవరకొండ నటిస్తోన్న చిత్రం వీడీ 12. కాప్ డ్రామా నేపథ్యంలో వస్తోన్న ఈ చిత్రానికి సంబంధించిన కొత్త అప్‌డేట్ కోసం ఎదురుచూస్తున్న అభిమానులతో గుడ్ న్యూస్ షేర్ చేసుకున్నాడు విజయ్ దేవరకొండ. వీడీ 12 ఫస్ట్ లుక్‌తో విడుదల తేదీపై క్లారిటీ ఇచ్చారు మేకర్స్.

అతని విధి అతని కోసం వేచి ఉంది. తప్పులు.. రక్తపాతం.. ప్రశ్నలు.. పునర్జన్మ.. అంటూ షేర్ చేసిన లుక్‌లో పొట్టి హెయిర్, ముఖంపై రక్తపు మరకలు, పొడవాటి గడ్డంలో ఉన్న విజయ్ దేవరకొండ బిగ్గరగా అరుస్తూ కనిపిస్తున్నాడు. స్టన్నింగ్‌గా కనిపిస్తున్న ఈ పోస్టర్ సినిమాపై అంచనాలు అమాంతం పెంచేస్తుంది. ఈ చిత్రాన్ని మార్చి 28న 2025లో విడుదల చేస్తున్నట్టు ప్రకటించారు.

సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్-శ్రీకర స్టూడియోస్ బ్యానర్ సంయుక్తంగా తెరకెక్కిస్తున్నాయి. విజయ్ దేవరకొండ అండ్ టీం ఇటీవలే శ్రీలంకలో వచ్చే కీలకఈ సినిమా 2025లో థియేటర్లలో సందడి చేయనుంది. VD12 చిత్రానికి టాలెంటెడ్ మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తుండగా.. పాపులర్ మలయాళ టెక్నీషియన్ గిరీష్ గంగాధరన్ సినిమాటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నాడు.



# లవర్‌బాయ్‌గా ఎన్టీఆర్..

### దేవర మూవీ నుంచి సెకండ్ సింగిల్ అప్‌డేట్

తెలుగు అగ్ర హీరో ఎన్టీఆర్ కథానాయకుడిగా కొరటాల శివ దర్శకత్వంలో రూపొందిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'దేవర'. జనతా గ్యారేజ్ వంటి బ్లాక్ బస్టర్ తర్వాత వీరిద్దరి కాంబోలో ఈ సినిమా రానుండటంతో భారీ అంచనాలు ఉన్నాయి. ఇక రెండు భాగాలుగా తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో జాన్వీకపూర్ కథానాయికగా నటిస్తుండగా, సైఫ్‌అలీఖాన్ విలన్ పాత్రలో కనిపించనున్నారు. విస్మరణకు గురైన ఓ తీర ప్రాంతం నేపథ్యంలో హై ఓల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాను సెప్టెంబర్ 27న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు చిత్రబృందం ప్రకటించిన విషయం తెలిసిందే. విడుదల తేదీ దగ్గర పడుతుండటంతో ప్రమోషన్స్ స్టార్ట్ చేసింది చిత్రబృందం. ఇందులో భాగంగా ఇప్పటికే ఫస్ట్ సింగిల్ ఫియర్ సాంగ్ విడుదల చేయగా.. యూట్యూబ్‌లో దూసుకుపోతుంది. ఇప్పుడు తాజాగా సెకండ్ సింగిల్ రొమాంటిక్ సాంగ్ అప్‌డేట్ ఇచ్చారు. ఈ మూవీ నుంచి సెకండ్ సింగిల్‌ను ఆగష్టు 05న విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా తారక్, జాన్వీలది రొమాంటిక్ పోస్టర్ ఒకటి వదిలారు. కాగా.. తంగం అంతరంగం అంటూ ఈ పాట ఉండబోతున్నట్లు సమాచారం. ఎన్టీఆర్ ఆర్ట్స్ , యువ సుధ ఆర్ట్స్ పతాకాలపై సుధాకర్, హరికృష్ణ కె ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అనిరుధ్ రవిచందర్ స్వరకర్త.